ఇల్లెందు

అనాథకు ఆపన్నహస్తం

ఇల్లెందు, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రధాన రహదారిపై అనాథగా జీవిస్తున్న ఓ వృద్ధురాలికి భోజనం తినిపించి దుప్పటి అందించి ఓ ఉపాధ్యాయుడు మానవత్వాన్ని చాటారు. టేకులపల్లి మండలం గంగారం ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న భూక్యా రాంబాబు సోమవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల వద్ద రహదారిపై జీవిస్తున్న అనాథ వృద్ధురాలి ఆకలిని గుర్తించి భోజనం తినిపించారు. గజగజ వణికించే చలి ఉన్నందున వృద్ధురాలికి దుప్పటిని అందించారు.

అశ్వమేధ మహాయజ్ఞానికి ఆహ్వానం

ఇల్లెందు సాంస్కృతికం, న్యూస్‌టుడే: లోకకల్యాణార్థం జరిగే అశ్వమేధ గాయత్రి మహాయజ్ఞానికి రావాలని కోరుతూ పరివార్ సభ్యులు సోమవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ మడత రమ, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ దిండిగల రాజేందర్‌కు ఆహ్వానపత్రికలు అందజేశారు. మంగళగిరిలో జనవరి 5నుంచి 8తేదీల్లో జరిగే ఈ మహాయజ్ఞంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సతీశ్ ఖండేల్‌వాల్, ఎస్వీ పరబ్, మాలకొండయ్య, రచన, రేణుక, శారద, సరోజిని పాల్గొన్నారు.

విజయం దివ్యాంగునికి దాసోహం

☛ పేదరికాన్ని జయించి... చదువులో రాణించి ☛ మధుబాబు విజయగాథ

కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిదేమీ లేదు. విజయాలు సాధించిన వారి గురించి ఎన్నో సందర్భాల్లో ప్రసార మాధ్యమాల ద్వారా చూసే ఉంటాం. ఇవన్నీ కేవలం అన్ని రకాల పరిపూర్ణ ఆరోగ్యం కలిగిన వ్యక్తి విషయంలో మాత్రమే. వీరిని ఆదర్శంగా తీసుకున్నారో లేక ఇప్పటికే దివ్యాంగత్వాన్ని జయించిన వారిని ఆదర్శంగా తీసుకున్నారో తెలియదుగానీ ఓ దివ్యాంగుడు తనలోని మరుగుజ్జు లోపాన్ని పక్కన బెట్టి అందరిలా ముందుకు సాగుతున్నారు. అతని లోపానికితోడు పేదరికం వెంటాడింది. అయినప్పటికీ పట్టుదలతో ముందుకుసాగి విజయాలు సాధిస్తున్నారు. నిరుపేద కుటుంబమైనప్పటికీ తల్లిదండ్రులు చదివించలేని పరిస్థితి. అందరూ అవహేళన చేస్తున్నప్పటికీ అకుంఠిత దీక్షతో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని నిలుపుకోవాలనుకున్నారు. ఈ లక్ష్యంతో ముందుకు సాగుతూ ఆదర్శంగా నిలుస్తున్న ఇల్లెందు పట్టణానికి చెందిన భాషబోయిన మధుబాబు విజయగాథ ఇదీ...

– ఇల్లెందు పట్టణం, న్యూస్‌టుడే

స్ఫూర్తి

కష్టేఫలి అన్న విషయంలో సాధారణ వ్యక్తులతోపాటు దివ్యాంగులు సాధించి తీరుతున్నారనే విషయాన్ని మరోసారి స్పష్టం చేశారు మధుబాబు. పట్టణంలోని హమాలీ బస్తీకి చెందిన లక్ష్మయ్య, విజయ దంపతులకు ముగ్గురు సంతానం. వీరిలో పెద్దవాడైన మధుబాబు మరుగుజ్జుగా దివ్యాంగత్వాన్ని పొందారు. నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మయ్య కిరాణ దుకాణంలో పని చేస్తూ వచ్చిన డబ్బులతో ఇంటిల్లిపాదిని సాకారు. పెద్దకుమారుడైన మధుబాబు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నారు. పదో తరగతిలో 406మార్కులు సాధించి అందరిలో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్‌ఈసీలో 556 మార్కులను సాధించారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల బీఏ(హెచ్‌ఈపీ) విభాగంలో చేరి కళాశాలలో 726 మార్కులతో మొదటిస్థానంలో సాధించి అందరికి ఆదర్శంగా నిలిచారు. ఇదే స్ఫూర్తితో కాకతీయ విశ్వవిద్యాలయం ఎంఏ ఆర్థికశాస్త్రంలో 10వ ర్యాంకును సాధించడం విశేషం. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సెట్-2015లో అర్హతను సాధించడం ఆయన పట్టుదలకు నిదర్శనం. వీటన్నింటికి మించి 2016లో ఆర్ఆర్‌బీ నిర్వహించిన పోటీపరీక్షలో సిగ్నల్ విభాగంలో సత్తాచాటి ఉద్యోగాన్ని సంపాదించారు. నేడు కొత్తగూడెం సిగ్నల్ విభాగంలో అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.



వక్తృత్వ పోటీల్లో ప్రతిభ సాధించినందుకు అందుకుంటున్న జ్ఞాపిక

సామాజిక అంశాల్లోనూ...

మధుబాబు చదువులో రాణించడంతోపాటు పర్యావరణ పరిరక్షణ, ఎన్ఎస్ఎస్‌లో కొనసాగుతూ పల్స్‌పోలియో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కళాశాలలో నిర్వహించే వక్తృత్వపోటీల్లో పాల్గొని తనకంటూ ప్రత్యేక ప్రతిభను చాటుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మధుబాబును పలు సందర్భాల్లో కళాశాలలో జ్ఞాపికలను అందజేస్తూ ప్రోత్సహించారు.

తహసీల్దార్ కావడమే లక్ష్యం: మధుబాబు



చిన్నప్పటి నుంచి ఎన్నో ఒడుదొడుకులకు లోనవుతూ కష్టపడి చదివాను. నాలోని లోపాన్ని మరచి అందరిలా ముందుకు సాగాలనుకున్నాను. తల్లిదండ్రుల కూలి పనులు, దుకాణాల్లో పనిచేసి నన్ను చదివించారు. వారి ఆశయాలకు అనుగుణంగా ప్రస్తుతం రైల్వేలో ఉద్యోగం సాధించాను. నా లక్ష్యం తహసీల్దార్ కావడమే. అందుకు అనుగుణంగా స్వయంగా గ్రూప్స్‌కు సిద్ధమవుతున్నాను. తల్లిదండ్రుల రుణం తీర్చుకునే అవకాశం రైల్వే ఉద్యోగం రూపంలో వచ్చింది.

అవును.. వైకల్యం ఓడింది

గార్ల, న్యూస్‌టుడే: సకల కోటి జీవరాశుల్లో మాట్లాడే అవకాశం ఒక్క మానవులకు మాత్రమే ఉందనే విషయం అందరికీ తెలిసిందే. కానీ, జన్మతోనే మాట్లాడడానికి, వినడానికి నోచుకోని వారి పరిస్థితి మరింత దైన్యంగా ఉంటుంది. తాము మాట్లాడలేకపోయినాసరే తమ భావాలను సంజ్ఞల ద్వారా వ్యక్తపరుస్తూ అబ్బురపరుస్తున్నారు ఓ అయిదుగురు యువకులు. వివరాల్లోకి వెళితే.. ఎస్.అశ్వన్‌సాయి, ఎం.కిరణ్‌కుమార్, జె.నవీన్ కుమార్, ఎం.వినోద్‌కుమార్, నేతకాని సుధాకర్ పుట్టుకతోనే మూగ, చెవుడు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లోని మూగ, చెవుడు పిల్లల కోసం ఏర్పాటు చేసిన పాఠశాలలో ఎం.వినోద్ కుమార్ పదో తరగతి చదువుతున్నాడు. అశ్వన్‌సాయి, కిరణ్ కుమార్, నవీన్‌నాయక్ ప్రయివేటుగా ఉద్యోగాలను నిర్వహిస్తున్నారు. ఎన్.సుధాకర్ గార్ల ఎంపీడీవో కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. ఈ అయిదుగురు సోమవారం ఆంగ్ల నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా స్థానిక నెహ్రూ విగ్రహకూడలి వద్ద ఓ బేకరీ దుకాణం వద్ద కలిశారు. అయిదురుగు కలిసి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలుపుకొన్నారు. అంతే కాదు చరవాణిలో తమ సంజ్ఞలతో భావ వ్యక్తీకరణ చేసుకోవటం పలువురిని విశేషంగా ఆకట్టుకుంది. ఈ అయిదురి మూగ భాషణలు నోరుండి మాట్లాడేవారి కన్నా తక్కువకాదనట్లు నిరూపిస్తున్నారు. నోరుండి మాట్లాడేవారు సైతం వారి సంజ్ఞలను అర్థం చేసుకోడానికి చేసిన ప్రయత్నాలు క్లిష్టంగా మారింది. ఈ యువకులు ఒకరితో మరొకరు చేసుకునే భావ వ్యక్తీకరణలు, చరవాణిలో సంజ్ఞలను సోమవారం 'న్యూస్‌టుడే' తన ఛాయాగ్రాహకంలో చిత్రీకరించింది.



చరవాణిలలో సంజ్ఞలతో సందేశాలు పంపుతూ...

ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమం కోసం ఉద్యమించాలి

ఇల్లెందు, న్యూస్‌టుడే: నూతన సంవత్సరంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమంపై ఉద్యమించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఆంథోని పేర్కొన్నారు. స్థానిక సంఘం కార్యాలయంలో నూతన సంవత్సరం కాలమానిని, డైరీలు, ప్యాకెట్ డైరీలను సోమవారం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నూతన సంవత్సరంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. పాశ్చాత్య పోకడలను వ్యతిరేకించాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిల్లి శ్రీనివాసరావు, నాగు, కోండ్రు బ్రహ్మం, ఖాసింపాషా, రమేశ్, రాంబాబు, శ్రీనివాస్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ఇల్లెందు సాంస్కృతికం, న్యూస్‌టుడే: భద్రాచలంలో జనవరి 2, 3, 4 తేదీలలో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలనీ పట్టణశాఖ కార్యదర్శి అబ్దుల్ నబీ పిలుపునిచ్చారు. స్థానిక ఏలూరి భవన్‌లో సోమవారం జరిగిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే మూడు సంవత్సరాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు చేసేందుకు ఈ మహాసభల్లో ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఈ సమావేశంలో కృష్ణ, మోహన్‌రావు, ఖాదర్ బాబు, విజయ్‌కుమార్, నర్సయ్య పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి చెల్లించాలి

★ ఇల్లెందుకు చేరిన నిరుద్యోగ బస్సు యాత్ర ★ సభలో పీవైఎల్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శులు

ఇల్లెందు, న్యూస్‌టుడే: ఉద్యోగాలు రాని నిరుద్యోగులకు ప్రభుత్వం నిరుద్యోగ భృతి చెల్లించాలని పీవైఎల్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శులు సీవై పుల్లయ్య, విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని వామపక్ష యువజన, విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరుద్యోగ బస్సు యాత్ర సోమవారం ఇల్లెందుకు చేరింది. ముందుగా మండలంలోని చీకటిగండ్ల అటవీలో పోలీసు ఎన్‌కౌంటర్‌లో అమరులైన పీడీఎస్‌యూ వ్యవస్థాపకులు జంపాల చంద్రశేఖర్, నీలం రామచంద్రయ్య స్థూపాలకు నాయకులు నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని పాతబస్టాండు సెంటర్లో బస్సుయాత్ర సభ ఏర్పాటైంది. ఈ సభలో నాయకులు ప్రసంగించారు. ఎన్నికలకు ముందు ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ విస్మరించారని విమర్శించారు. ప్రభుత్వ రంగంలోని ఉద్యోగాల ఖాళీలతో ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం లక్షలాదిగా నియామకాలు చేపడుతుందని ప్రయివేటు ఉద్యోగాలు వదిలేసి శిక్షణ పూర్తిచేసుకొని నిరుద్యోగ అభ్యర్థులు నిరీక్షిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగాలు వస్తాయని ఆశించిన నిరుద్యోగులు ఉద్యోగాలు రాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యలు విలయతాండవం చేస్తుందన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న నిరుద్యోగుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికై నిరుద్యోగులు సైనికుల్లా పోరాడాలని కోరారు. రాష్ట్ర పాలకులు ప్రజా, రైతాంగ, యువజన వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని విమర్శించారు. బస్సు యాత్రకు ఎన్డీ, సీపీఎం, సీపీఐ నాయకులు సంఘీభావం వ్యక్తం చేశారు. సభలో ఆర్ఎస్‌సీ బోసు, జలాల్, కాంపాటి పృథ్వీ, కాళంగి హరికృష్ణ, చంటి, నాగరాజు, బాలరాజు, సీతారామరాజు, హరీశ్, అభిమన్యు, సంధ్య, రాజు, రవి, అజయ్, ప్రశాంత్, అశోక్ పాల్గొన్నారు.



బస్సు యాత్ర సభలో ప్రసంగిస్తున్న పుల్లయ్య

లంబాడాలను తొలగించే వరకు ఉద్యమాలు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు ఆదివాసీ సంఘాల ఉద్యమాలు తీవ్రతరం చేయనున్నట్లు ఆదివాసీ ఉపాధ్యాయ సంఘం(ఏటీఎఫ్) రాష్ట్ర ప్రచార కార్యదర్శి కబ్బాకుల రవి, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు తోడెం కృష్ణ స్పష్టం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణలో ఎస్టీలుగా చలామణీ అవుతున్న లాంబాడీలను మహారాష్ట్రలో బీసీలుగా, రాజస్థాన్‌లో ఓసీలుగా పరిగణిస్తారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం లంబాడా తెగలను ఎస్టీ జాబితాలో చేర్చలేదనీ, 1976లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్రకు చెందిన వారిని మాత్రమే ఎస్టీలో కలిపారు తప్ప తెలంగాణాలో కాదన్నారు. ప్రణాళికాబద్ధంగా కోయలు, గోండు, ఉపకులాలకు దక్కాల్సిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను లంబాడీ తెగలు చేజిక్కించుకోని అనుభవిస్తున్నారని ఆరోపించారు. కుంజ కృష్ణ, రామచంద్రు, వీరభద్రం, చాపల రమేశ్, బాలరాజు, మోహన్‌రావు, రమాదేవి, రాంబాబు, కృష్ణార్జునరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏటీఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కబ్బాకుల రవి

ఇల్లెందు

కోయగూడెంలో ఇల్లు దగ్ధం

బయ్యారం: మండలంలోని కంబాలపల్లి పంచాయతీ కోయగూడెంలో అగ్నిప్రమాదానికి గురై సోమవారం ఒక ఇల్లు దగ్ధమైంది. కోయగూడేనికి చెందిన తాటి కృష్ణ ఇంటిలో విద్యుదాఘాతంతో నిప్పంటుకుంది. ఈ మంటలు ఒక్కసారిగా ఇల్లంతా వ్యాపించాయి. దీంతో ఇంట్లో ఉన్న 6క్వింటాల పత్తి, 5క్వింటాల బియ్యం, వస్తుసామగ్రి పూర్తిగా కాలిబూడదయ్యాయి. ఇంట్లో ఉన్న రూ.10వేల నగదు కాలిపోయింది. ప్రమాద సంఘటన తెలుసుకున్న వైస్‌ఎంపీపీ మూల మధుకర్‌రెడ్డి, ఏనుగుల ఐలయ్య, మంగీలాల్, కోయగూడెం వెళ్లి బాధితున్ని పరామర్శించారు.

సినిమాలు

లలిత్‌కళామందిర్: 2కంట్రీస్
సీతారామ: హలో
కళాంజలి : ఎంసీఏ మిడిల్ క్లాస్ అబ్బాయి



యువత క్రీడలపై దృష్టి సారించాలి


ఇల్లెందు గ్రామీణం: క్రీడలను ప్రారంభిస్తున్న ఎస్‌హెచ్‌వో ఎస్.సారంగపాణి


బయ్యారం: బహుమతులను అందిస్తున్న పీవైఎల్ నాయకులు


గార్ల: మూడు జిల్లాల స్థాయి విజేతలతో ప్రజాప్రతినిధులు

గార్ల, న్యూస్‌టుడే: యువత చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని ఇల్లెందు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు భూక్యా నాగేశ్వరరావు, ఎంపీపీ వెంకట్‌లాల్ కోరారు. గార్లలో డిసెంబరు 28నుంచి నిర్వహిస్తున్న మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఈ పోటీల్లో ఖమ్మానికి చెందిన వి.రోహిత్‌చంద్ర, ఎ.పవన్‌కుమార్ ప్రథమస్థానం సాధించారు. గార్లకు చెందిన బి.శేఖర్, యాకూబ్‌పాషా ద్వితీయస్థానం పొందారు. నగదు బహుమతులను సీనియర్ క్రీడాకారుడు జిలానీ, ప్రజాప్రతినిధుల చేతులమీదుగా అందజేశారు. తోడేటి రవి జ్ఞాపకార్థం ఈ పోటీలను నిర్వహించారు. డోర్నకల్ జడ్పీటీసీ సభ్యుడు కోటిలింగం, వార్డుసభ్యులు తోడేటి శ్రీనుగౌడ్, మొగిలి వెంకన్న, ఎస్ఎంసీ ఛైర్మన్ కోలా కుమార్‌గౌడ్, తెరాస పట్టణాధ్యక్షుడు చిలివేరి శంకర్, మల్లేశ్, కాలా విశాల్‌కుమార్, సురేందర్, వి.రాజేశ్, ప్రశాంత్, క్రాంతి, రాము పాల్గొన్నారు.

బొజ్జాయిగూడెంలో వాలీబాల్ క్రీడలు ప్రారంభం

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బొజ్జాయిగూడెంలో యంగ్ తరంగ్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం సబ్‌డివిజన్ స్థాయి వాలీబాల్ క్రీడలను ఇల్లెందు ఎస్‌హెచ్‌వో ఎస్.సారంగపాణి ప్రారంభించారు. అనంతరం ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించి మాట్లాడారు. వాలీబాల్‌పై మన్యం యువత ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. యువత చెడు వ్యసనాలు, దురలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ కొమరెల్లి, తెదేపా కార్యదర్శి పర్చూరి వెంకటేశ్వర్లు, నిర్వాహకులు కోర్స కోటయ్య, చీమల వెంకటేశ్వర్లు(సీఎం), మెట్ల కృష్ణ, నగేశ్, కుంజ బాలకృష్ణ, మాధవరావు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రీడలు

బయ్యారం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో పీవైఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తుడుం రామయ్య స్మారక క్రీడలు సోమవారం ముగిశాయి. కబడ్డీ, షటిల్ విభాగంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్మారకపోటీల్లో మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మండలాల నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ నెల 29న ప్రారంభమైన స్మారకక్రీడలు మూడు రోజులపాటు నిర్వహించారు. విజేతలకు పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకాళ్ల రమేశ్ బహుమతులు అందజేశారు. కబడ్డీలో గురిమెళ్ల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఇర్సులాపురం ద్వితీయ, ఆలేరు తృతీయ స్థానాలు పొందాయి. షటిల్ డబుల్స్‌లో శ్రీనివాస్, సుధాకర్, సింగిల్స్‌లో శ్రీనివాస్ ప్రథమ స్థానం సాధించారు. ద్వితీయ స్థానం షేక్ ఖాసీం పొందారు. ఈ సందర్భంగా మోకాళ్ల రమేశ్, రాష్ట్ర నాయకులు తుడుం వీరభద్రం, ఎన్డీ జిల్లా నాయకులు షేక్ మదార్ మాట్లాడారు. లక్ష్మణ్, నాగేశ్వర్‌రావు, రామచంద్రయ్య, పొమ్మన్న, రవి, అనురాధ, కోటమ్మ, నగేశ్ పాల్గొన్నారు.

కొత్త ఏడాదిలో మరిన్ని సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే

టేకులపల్లి(ఇల్లెందు పట్టణం), న్యూస్‌టుడే: టేకులపల్లిలో నూతనసంవత్సర వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. డిసెంబర్31 అర్ధరాత్రి నుంచే పాత సంవత్సరానికి వీడ్కోలు చెప్పి నూతన సంవత్సర కేక్‌లను కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నూతన సంవత్సరంలో కేసీఆర్ హయాంలో మరిన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అన్నివర్గాల ప్రజలను అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. టేకులపల్లిలో పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు లక్కినేని సురేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

నూతన సంవత్సరంలోనూ మరింత ఉత్తేజంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నియోజకవర్గ నాయకులు దళ్‌సింగ్, హరిప్రియ పేర్కొన్నారు. టేకులపల్లిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని సోమవారం వారు కేక్‌ను కట్ చేశారు. పాత సంవత్సరానికి వీడ్కోలు, కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ నూతన లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బండ్ల శ్రీనివాసరావు, బండ్ల రజనీ, నరసింహారావు, సక్రు, శివ పాల్గొన్నారు.

వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యుడు రమేశ్ నూతన సంవత్సర కేక్‌ను కట్ చేశారు. అందరూ ఆరోగ్యకర జీవనం గడపాలని ఆకాంక్షించారు. అనంతరం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాకం శ్యాంబాబు, సిటిజన్ ఫోరం సభ్యులు ఇమ్మాన్యుయేల్, విమల, దాసరి నరేందర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు

ఇల్లెందు సాంస్కృతికం, న్యూస్‌టుడే: నూతన ఆంగ్ల సంవత్సరం 2018ను పురస్కరించుకుని సోమవారం పట్టణ ప్రజలు ఉత్సాహంగా వేడుకలు జరిపారు. గ్రీటింగ్‌కార్డులు పంచుకుని, శుభాకాంక్షలు తెలుపుకుంటూ సైకిళ్లపై వీధుల్లో సందడి చేశారు. మహిళలు 2018కు స్వాగతం పలుకుతూ వాకిళ్లలో రంగవల్లులను తీర్చిదిద్దారు. పట్టణంలోని పలు చర్చిలలో కొత్త సంవత్సరం సందర్భంగా మత పెద్దలు కేకు కత్తిరించి, ప్రార్థనలు చేశారు. మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులు కేకు కత్తిరించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. టి-మాస్ ఫోరమ్ ఆధ్వర్యంలో 13నెంబరు బస్తీలో కేక్ కట్ చేసి కొత్త సంవత్సరం వేడుకలు జరిపారు.

బయ్యారం, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలను మండల ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు కొత్తపేట, గంధంపల్లి, సత్యనారాయణపురం, వెంకట్రాంపురం, ఇర్సులాపురంలో వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి వరకు కొన్ని గ్రామాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంలో కొందరు యువకులు ప్రత్యేకంగా వేదికలు ఏర్పాటు చేసి నృత్యాలు చేశారు. బయ్యారం బస్టాండ్‌సెంటర్‌లో బేకరీల్లో కేకులు, మిఠాయిలు కొనేందుకు జనం ఎగబడ్డారు. నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ ఇంటి లోగిళ్లలో మహిళలు, యువతులు రంగురంగుల ముగ్గులు వేసి అందంగా అలంకరించారు. బయ్యారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి కేకు కత్తిరించి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఇల్లెందు, న్యూస్‌టుడే: తెదేపా ఆధ్వర్యంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సర కేక్‌ను పట్టణాధ్యక్షుడు ముద్రగడ వంశీ, ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ, పరుచూరి వెంకటేశ్వర్లు కట్ చేశారు. మిఠాయిలను పార్టీ కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గడిచిన సంవత్సరం జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ నూతన సంవత్సరంలో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో పార్టీ బలోపేతానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చెన్నకేశవరావు, కొండమల్ల కృష్ణ, నాగరాజు, శ్రీహరి, పాషా, బాలరాజు, యాకయ్య, లింగయ్య, సంపత్, కడారి నటరాజ్, రమేశ్‌బాబు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఇల్లెందు, న్యూస్‌టుడే: ఇల్లెందు న్యాయస్థానం న్యాయమూర్తి జె.శ్రీనివాసరావుకు సబ్‌డివిజన్ పోలీసులు, న్యాయవాదులు సోమవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. న్యాయమూర్తి నివాసంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సరం వేడుకల్లో వారు పాల్గొన్నారు. ఇల్లెందు సీఐ ఎస్.సారంగపాణి న్యాయమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు.

గార్ల, న్యూస్‌టుడే: స్థానిక తెరాస కార్యాలయం వద్ద సోమవారం ఆంగ్ల నూతన సంవత్సరం వేడుకలను తెరాస ప్రజాప్రతినిధులు, నాయకులు యువకుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ మాళోత్ వెంకట్‌లాల్ కేకును కోసి పంచిపెట్టారు. మంప్రాని సభ్యుడు కిశన్, పుల్లూరు సర్పంచి జె.రమేశ్, వార్డుసభ్యుడు మొగిలి వెంకన్న, తెరాస పట్టణాధ్యక్షుడు సీహెచ్ శంకర్, కట్టా శ్రీనివాసరావు, సురేందర్, శివాజీ, రామారావు, హెచ్.రవి, బాలు, కిరణ్‌కుమార్, అశ్వన్‌సాయి, నవీన్‌నాయక్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఇల్లెందు పట్టణం, న్యూస్‌టుడే: నూతనోత్సాహంతో అన్ని వర్గాల ప్రజలు ముందుసాగాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎస్కే జానీ పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నూతన సంవత్సర కేక్‌ను కత్తి రించి, నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు గత సంవత్సరంలోని చేదు అనుభవాలను వదిలేసి ఆత్మవిశ్వాసంతో నూతన సంవత్సరాన్ని సరికొత్త నిర్ణయాలతో విజయం సాధించాలని తెలిపారు. రైతు విభాగం నియోజకవర్గ సమన్వయకర్త చీమలవెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు పోశం వెంకటేశ్వర్లు, నందకిశోర్, హరిప్రియ, ఆర్మీ రవి, జీవీభద్రం, బండ్ల రజని, హరిసింగ్, సత్యవతి పాల్గొన్నారు.

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని హనుమంతులపాడు అనాథ ఆశ్రమంలో సోమవారం ప్రముఖ వైద్యుడు, కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ నాయకుడు జి.రవి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి ఆయన కేక్‌ను కత్తిరించి, మిఠాయిలను పంపిణీ చేశారు. చిన్నారులకు భోజనం ఏర్పాటు చేశారు. ఎల్.కృష్ణ, పాషా, ప్రవీణ్, హిందీ సేవా భారతి అధ్యక్షుడు బి.రాంబాబు, సలీం, రమేశ్, బాలప్రసాద్, ఇబ్రహీం పాల్గొన్నారు.


ఇల్లెందు సాంస్కృతికం: వేడుకల్లో మైనారిటీ గురుకుల విద్యార్థులు


ఇల్లెందు గ్రామీణం: చిన్నారులకు భోజనం ఏర్పాటు చేసిన దృశ్యం


గార్ల: కేకును కోస్తున్న ఎంపీపీ వెంకట్‌లాల్

12 శాతం రిజర్వేషన్ సాధనకు ఉద్యమం

వెంకటాపురం, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణతో పాటు మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ సాధనకు శక్తివంచన లేకుండా పోరు సాగించాలని మాదిగ ఐకాస రాష్ట్ర కన్వీనర్ కొడారి ధీరన్ పేర్కొన్నారు. నూతనంగా రాష్ట్ర కన్వీనర్‌గా ధీరన్‌ను ఇటీవల ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి ఎన్నిక చేశారు. ఈమేరకు ఆ శ్రేణులు సోమవారం వెంకటాపురంలో ధీరన్‌ను ఘనంగా సత్కరించారు.

ఐక్యతతో హక్కులు సాధించుకుందాం

అంబేడ్కర్ సెంటర్, న్యూస్‌టుడే: ఐక్యతతో హక్కులు సాధించుకుందామని వడ్డెర సంఘం నాయకులు అన్నారు. సోమవారం భద్రాచలం అంబేడ్కర్ సెంటర్‌లో డివిజన్ అధ్యక్షుడు బండారు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో సంఘం నాయకులు పాల్గొని మాట్లాడారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వడ్డెరలు ఐక్యతతో ముందుకు సాగాలని అన్నారు.

నవ వసంతం... వేడుకలే ఆసాంతం



కొత్తగూడెం గణేశ్‌టెంపుల్: కొత్త సంవత్సరం వేడుకల్లో టీజీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకటపుల్లయ్య



కొత్తగూడెం (సింగరేణి): వెంకటరావును కలిసిన జిల్లా, నియోజకవర్గ అధికారులు



కొత్తగూడెం పట్టణం: అనాథాశ్రమంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీ కార్యాలయం నాయకులు



కొత్తగూడెం పట్టణం: ప్రధాన కార్యాలయంలో కేక్‌ను కట్ చేస్తున్న గుర్తింపు సంఘం నాయకులు

కొత్తగూడెం సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం కొత్తగూడెంలో నూతన సంవత్సర వేడుకలను స్థానికులు ఆనందోత్సాహాల నడుమ జరిపారు. సోమవారం క్రైస్తవాలయాల్లో అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. రైటర్స్ బస్తీ ఆర్‌సీఎం చర్చి, పోస్టాఫీస్ ఏరియాలోని సీఎస్ఐ క్రైస్తవాలయం, రామవరం బేతానియా, సీఎస్ఐ, రుద్రంపూర్ క్రైస్తవాలయాల్లో క్రైస్తవ విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. సంఘ కాపరులు సందేశాలనందించారు.

★ కొత్తగూడెం, రామవరం, రుద్రంపూర్‌లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. రుద్రంపూర్ ఆలయంలో ప్రత్యేక పూజల్లో ఎస్పీ అంబర్‌కిషోర్ పాల్గొన్నారు.

కొత్తగూడెం గణేశ్‌టెంపుల్, న్యూస్‌టుడే: మేదరబస్తీలో యహోవా షాలోం చర్చిలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. మూడో పట్టణ సీఐ ఎం.ఎ.షుకూర్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. చర్చి పాస్టర్ మహిమ జ్యోతి, గూడెం వార్డు కౌన్సిలర్‌లు సత్యభామ, నీలావతి పాల్గొన్నారు.

* తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం సోమవారం రైటర్‌బస్తీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీజీఓఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య హాజరై కేక్ కట్ చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.డి.హుస్సేన్, మల్లెల ఉషారాణి, పి.హుస్సేన్, భానుమతి, మునీల తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జూనియర్ న్యాయవాదులు వృత్తిలో నైపుణ్యం సాధించి ప్రతిభ కనబర్చాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జమలేశ్వరరావు అన్నారు. సోమవారం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సంఘ కార్యాలయంలో ఏర్పాటుచేసిన నూతన సంవత్సర వేడుకలను కేక్‌కట్ చేసి ప్రారంభించారు. న్యాయమూర్తులు సత్తయ్య, విజయసారధిరాజు, సునీతరాణి, రాధిక, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు అనుబ్రోలు రాంప్రసాదరావు, కార్యవర్గ సభ్యులు జె.గోపీకృష్ణ, ఎం.ఎస్.ఆర్.రవిచంద్ర, సి.హెచ్.వి.నర్సింహారావు, ఎ.పార్వతి, కె.రమేష్, అడిషినల్ పీపీ వి.పురుషోత్తమరావు, ఎ.జి.పి.బాబురావు, న్యాయవాదులు వెంకటరత్నం, రామ్మూర్తి, చిరంజీవిరావు, భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచగ్రామీణం, న్యూస్‌టుడే: తెలంగాణ స్టేట్‌పవర్ ఎంప్లాయీస్ యూనియన్-1535 రాష్ట్ర అధ్యక్షుడు ఎంఏ వజీర్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. జెన్కో డైరెక్టర్ సి. రాధాకృష్ణ, సీఈలు సమ్మయ్య, టీఎస్ఎన్ మూర్తిలు వచ్చి కేక్ కట్, విద్యుత్ అధికారులు, కార్మికులు, ఆర్టిసన్స్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇ-1535 నాయకులు రాము, శంకర్‌మణి, నాగేశ్వరరావు, గౌసుద్దీన్, శ్రీధర్, రాధాకృష్ణ, శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, దానం నర్సింహారావు, విజయ్‌కుమార్, సాంబయ్య పాల్గొన్నారు.



పాల్వంచగ్రామీణం : కేక్‌కట్ చేస్తున్న జెన్కో డైరెక్టర్



ఆర్‌సీఎం చర్చిలో నూతన సంవత్సర ఆరాధనలో సంఘ కాపరులు, క్రైస్తవ విశ్వాసులు

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు, ప్రజాప్రతినిధులు

కొత్తగూడెం (సింగరేణి), న్యూస్‌టుడే: కొత్తగూడెం శాసన సభ్యుడు జలగం వెంకటరావుకు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సోమవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. లక్ష్మీదేవిపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయానికి వెళ్లిన వారు ఆయన్ను స్వయంగా కలిసి శుభాకాంక్షలను అందించారు. ఆర్డీవో రవీంద్రనాథ్, పోలీసు అధికారులు, ఇరిగేషన్ అధికారులు, గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు, అటవీ, వ్యవసాయ శాఖ అధికారులు, టీఎన్జీవో నాయకులు, జర్నలిస్టు యూనియన్ నాయకులు, ఆర్టీఏ అధికారులు, ఎంపీడీవో కార్యాలయం, మున్సిపల్ అధికారులు శుభాకాంక్షలను అందించారు.

* ఎంపీ పొంగులేటి క్యాంపు కార్యాలయం ఆధ్వర్యంలో చాతకొండ వృద్ధాశ్రమంలో జ్యోతి అనాథాశ్రమంలో, బూడిదగడ్డలోని స్నేహలత,సంధ్యలత అనాథాశ్రమంలో వేడుకలు జరిగాయి. నాయకులు కొదమసింహం పాండురంగాచార్యులు, లక్కినేని వెంకటసాయికృష్ణ, కందుల సుధాకర్‌రెడ్డి, పులి రామస్వామి, ఇమ్రాన్, పాషా, గాంధీ, దేవిలాల్ పాల్గొన్నారు.

★ ప్రధాన కార్యాలయంలో సోమవారం తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం నాయకులు కేక్‌ను కట్‌చేసి ఉద్యోగులకు పంచిపెట్టారు. జీవీకే మనోహర్, టి.నరేంద్రబాబు, జీకే సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: కూలీలైన్ ఏరియాలో పురపాలక వైస్ ఛైర్మన్ రావి రాంబాబు అధ్యక్షతన నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. తెదేపా జిల్లా అధ్యక్షులు కోనేరు సత్యనారాయణ(చిన్ని) హాజరయ్యారు.

పాల్వంచగ్రామీణం, న్యూస్‌టుడే: లక్ష్మీదేవిపల్లి అనాథ బాలుర ఆశ్రమంలో పాల్వంచ మేరుసంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. సంఘం నాయకులు కీర్తి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రాజమనోహర్, రాజేంద్రప్రసాద్, రాంబాబు, భద్రయ్య, రవీందర్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ

పాల్వంచ సాంస్కృతికం, న్యూస్‌టుడే: కొత్త సంవత్సరం సందర్భంగా దేవాలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. సోమవారం జగన్నాధపురం పెద్దమ్మ గుడి, పట్టణంలోని రామాలయ భజన మందిరం, నవభారత్‌లోని వేంకటేశ్వరాలయం, శ్రీనివాస కాలనీ శివాలయం, ఆర్సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, పూజలు జరిగాయి. ఆర్సీఎం చర్చిలో మత పెద్ద ఆంథోని తెల్లవారుజాము నుంచి ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలు జరిపారు. పెద్దమ్మ తల్లిని అశ్వారావుపేట ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు.

* మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు స్వగృహంలో కేక్‌కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎడవల్లి కృష్ణ ఆధ్వర్యంలో ఆయన గృహంలో వేడుకలు నిర్వహించారు. తెరాస పట్టణ అధ్యక్షుడు మంతపూరి రాజు గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. తెదేపా కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి కాపా కృష్ణమోహన్, వీరమాచినేని రత్నాకర్ రావు, కత్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుక జరిపారు.



పాల్వంచ సాంస్కృతికం: నూతన సంవత్సర వేడుకల్లో మాజీ మంత్రి వనమా



పాల్వంచ సాంస్కృతికం: కేక్ కట్ చేస్తున్న ఎడవల్లి కృష్ణ



పాల్వంచ సాంస్కృతికం: తెరాస పార్టీ ఆధ్వర్యంలో...



పాల్వంచ సాంస్కృతికం: టీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో ఎస్సీ వసతి గృహంలో..



పాల్వంచ సాంస్కృతికం: కమ్మసేవా సంఘం ఆధ్వర్యంలో..



కొత్తగూడెం గణేశ్‌టెంపుల్: వేడుకలో న్యాయమూర్తులు, న్యాయవాదుల సంఘం నాయకులు



పాల్వంచ సాంస్కృతికం: వేంకటేశ్వరాలయంలో పూజలో భక్తులు

సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో వేడుకలు

చుంచుపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ఎన్.కె.నగర్‌లో సీనియర్ సిటిజన్స్ సంఘం ఏర్పాటై 15 ఏళ్లు అయిన సందర్భంగా సోమవారం ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. కేకును కత్తిరించి సభ్యులంతా సంబరాలు జరుపుకొన్నారు. సీనియర్ సిటిజన్లు చంద్ర సత్యనారాయణ, బాబురావు, రామ సత్యనారాయణ, సత్యనారాయణ, మధుసూదన్‌రెడ్డి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వాల్వ్‌లకు మరమ్మతులు ఎప్పుడో..



ఇందిరానగర్‌కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద పాడైన వాల్వ్



పేటచెరువులోని ఉపరితల భాండాగారం వద్ద ఇలా...



బొల్లోరిగూడెంలో వాల్వ్ నుంచి వృథా అవుతున్న నీరు

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: పాల్వంచ పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో వాల్వ్‌లు పాడవ్వడంతో నీరు కలుషితం అవుతుంది. అధికారులు చేపడుతున్న మరమ్మతులు కేవలం పైపులకు మాత్రమే పరిమితమవుతున్నాయి. కొన్ని కాలనీల్లో అయితే పైపు లీకులకు సైతం మోక్షం కలగడం లేదు. ఉపరితల భాండాగారాల వద్ద ఉన్న వాల్వ్‌లు మొదలు కాలనీల్లో సరఫరాకు ఏర్పాటు చేసిన వాల్వ్‌ల వరకు ఇదే పరిస్థితులు ఉంటున్నాయి. పూడుకపోవడం, విరిగిపోవడం, త్రెడ్‌లు తెగిపోవడం, అరిగిపోవడం వంటి సమస్యలతో పాడవుతున్నాయి. నీటి సరఫరా సమయంలో నీరు వృథాగా మారి వాల్వ్‌లు ఉన్న ఛాంబర్లు నిండుతున్నాయి. ఛాంబర్లు లేనిచోట బురద గుంతలు ఏర్పడుతున్నాయి. ఆపరేటర్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం గమనార్హం. ప్రధాన వాల్వ్‌లు, అంతర్గత వీధుల్లో ఉండే వాల్వ్‌లు కలిపి మొత్తం పట్టణంలో ఆరువందల వరకు ఉన్నాయి.

సీఎండీని కలిసిన విద్యుత్ ఉద్యోగులు

పాల్వంచగ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్ ఉద్యోగులకు నూతన సంవత్సరం కానుకగా ఓ ఇంక్రిమెంట్ సీఎం కేసీఆర్ ప్రకటించడం హర్షనీయమని, ఈ నిర్ణయంలో సీఎండీ ప్రభాకర్‌రావు కృషి ఉందని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 కేటీపీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం సీఎండీ ప్రభాకర్‌రావుకు పుష్పగుచ్ఛం అందించారు. విద్యుత్ ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రగామిగా ఉందన్నారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరాతోపాటు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో సీఎండీ కృషి ఉందన్నారు. 1104 రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏవీ కోటేశ్వరరావు, జెన్కో వర్కింగ్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు, రీజినల్ అధ్యక్షుడు సత్యం, రాజన్న, రవీందర్, నరేందర్, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'ప్రజా బంధువు సీఎం కేసీఆర్'



మిఠాయిలు పంచుతున్న కిలారు నాగేశ్వరరావు


పాల్వంచ సాంస్కృతికం, న్యూస్‌టుడే: సీఎం కేసీఆర్ ప్రజా బంధువు అని పాల్వంచ మండల రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ కిలారు నాగేశ్వరరావు అన్నారు. సోమవారం పట్టణంలోని సబ్ స్టేషన్ సమీపంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం రైతులకు మిఠాయిలు పంచారు. ఆయన మాట్లాడుతూ రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా పథకం ప్రవేశపెట్టి దేశంలో ఆదర్శంగా నిలిచారన్నారు. రైతులు రామయ్య, నర్సయ్య, సముద్రాల రామలక్ష్మణులు, తెరాస నాయకులు మల్లెల రవిచంద్ర, కాపర్తి వెంకటాచారి, డొప్పలపూడి సురేశ్‌బాబు, కిలారు చిన్న, సత్యం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శుద్ధజల కేంద్రం ప్రారంభం

సుజాతనగర్(కొత్తగూడెం గ్రామీణం), న్యూస్‌టుడే: లక్ష్మీదేవిపల్లి గ్రామంలో స్థానిక ప్రజలు, దాతల సహాయంతో శుద్ధజలం కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా సర్పంచి వేములపల్లి సత్యనారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి కాసాని అయిలయ్య మాట్లాడారు. సుజాతనగర్‌ను మరో గంగదేవిపల్లిగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పంచాయతీలో 5 ప్రాంతాల్లో శుద్ధజలం కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అయిలయ్య అన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు మండే వీరహనుమంతరావు, నాయకులు కున్సోత్ ధర్మా, గుగులోత్ ధర్మా, వీర్ల రమేశ్, ఎంపీటీసీ కుమారి లక్ష్మణ్, మోతీ, శంకర్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా వేంకటేశ్వర కల్యాణం

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: శ్రీనగర్‌కాలనీలోని శ్రీచండీ సర్వజ్ఞ పీఠంలో సోమవారం వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు రామానుజ కుమారశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, సామూహిక ధనుర్మాస తిరుప్పావై పారాయణం, విశేష ఆరాధన, గోవింద నామాలు, నీరాజ మంత్రపుష్పం నిర్వహించారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో భక్తులు అన్నదానాన్ని నిర్వహించారు. క్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ పల్లపోతు వాసు, క్లబ్ పట్టణ అధ్యక్షులు కొత్తూరు రమేశ్, కార్యదర్శి చెక్క ఫణీంద్ర కుమార్, వందనపు రామారావు, రాజమనోహర్ అన్నదానాన్ని పర్యవేక్షించారు.



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కొత్తగూడెం సాంస్కృతికం, న్యూస్‌టుడే: సింగరేణి బాలుర పాఠశాల 1995-96 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడెం రామవరంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణ, జానీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వివిధ ప్రాంతాల నుంచి పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు సంఘం ఆధ్వర్యంలో అందించాల్సిన సహాయ సహకారాలను చర్చించారు. సంఘ నాయకులు దేవేందర్, శ్రీనివాస్, సికిందర్, ప్రవీణ్, రాజేశ్వరరావు, శ్యాంసుందర్ పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తాత్కాలిక ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పాల్వంచగ్రామీణం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ గురుకులాల్లో, కళాశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం ఉపాధ్యాయులు సర్వీసును క్రమబద్ధీకరించాలని గురుకులాల రాష్ట్ర కార్యదర్శి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ విన్నవించారు. సోమవారం స్వేరో సెంట్రల్ కమిటీ నాయకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో కలిశారు. చాలీచాలని వేతనాలతో ఎన్నో ఏళ్ల నుంచి నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. స్పందించిన ఆయన సమస్యల్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మల్సూర్, కృష్ణయ్య, రాజు, రాము, రామారావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రవీణ్‌కుమార్‌ను కలిసిన పార్ట్‌టైం ఉపాధ్యాయులు

ఒకటో పట్టణ సీఐగా కుమారస్వామి

కొత్తగూడెం నేరవార్తలు, న్యూస్‌టుడే: కొత్తగూడెం ఒకటో పట్టణ సీఐగా కె.కుమారస్వామి సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల పోలీసు శాఖలో ఉద్యోగోన్నతులు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయంలో భాగంగా ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న అతనికి సీఐగా ఉద్యోగోన్నతి లభించింది. 2003లో ఏపీఎస్‌పీ కానిస్టేబుల్‌గా కొనసాగిన అతను 2006లో సివిల్ కానిస్టేబుల్‌గా, 2009లో ఎస్సైగా విధులు చేపట్టారు. పూర్వ ఖమ్మం జిల్లాలో పాల్వంచ, ఇల్లెందు, చింతకాని, ఖమ్మం, బోనకల్లు, టేకులపల్లి, మణుగూరులో ఎస్సైగా విధులు కొనసాగించారు. సీఐగా ఉద్యోగోన్నతి వచ్చిన తరువాత మొదటి పోస్టింగ్ కొత్తగూడెం ఒకటో పట్టణ సీఐగా కొనసాగనున్నారు.

సంక్షేమ పథకాల అమల్లో విఫలం

పెనుబల్లి(చుంచుపల్లి), న్యూస్‌టుడే: మూడున్నర ఏళ్ల పాలనలో సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా విమర్శించారు. ఇనుముల నర్సింహారావు అధ్యక్షతన సోమవారం పెనుబల్లి పంచాయతీలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. పరాయి పాలనలో పాలకులు గ్రామాలను నిర్లక్ష్యం చేశారని పదేపదే విమర్శలు చేస్తున్న తెరాస ప్రభుత్వం స్వపరిపాలనలో చేసిందేంటని ప్రశ్నించారు. స్థానిక సంస్థలకు నిధులు కేటాయించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామాల్లో తిరిగే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి సలిగంటి శ్రీనివాస్, నాయకులు బత్తుల సురేశ్, ఇనుముల రాజు, రెడ్డి శ్రీను, చంటి, భద్రం పాల్గొన్నారు.

దుప్పట్లు వితరణ

కొత్తగూడెం గణేశ్‌టెంపుల్, న్యూస్‌టుడే: అనాథలకు యువకులు దుప్పట్లు వితరణ చేశారు. ఆదివారం అర్ధరాత్రి పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో 46మందికి దుప్పట్లు అందించినట్లు ఆ యువకులు పేర్కొన్నారు. దుప్పట్లు అందించిన వారిలో శివ, శ్యామ్, పూర్ణ తదితరులున్నారు.



దుప్పట్లు కప్పుతున్న యువకులు

కమిషనర్ వ్యవహారాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

తెదేపా జిల్లా అధ్యక్షుడు కోనేరు చిన్ని

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: కొత్తగూడెం పురపాలక కమిషనర్ వ్యవహార శైలిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెదేపా జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ(చిన్ని) పేర్కొన్నారు. పురపాలకంలో ఇష్టారీతిలో వ్యవహరిస్తూ అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నారన్నారు. సోమవారం కొత్తగూడెంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇలాంటి కమిషనర్‌ను కొందరు ఎందుకు వెనకేసుకొస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం విషయంలో కమిషనర్ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణిస్తూ మున్సిపల్ శాఖ డైరెక్టర్ సరెండర్ చేసినా, తాజాగా నోటీసులు జారీ చేసినా అతనికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు కొందరు నాయకులు ప్రయత్నాలు సాగిస్తున్నారన్నారు. కిన్నెరసాని ప్రత్యామ్నాయ నిర్మాణ పనుల్లో కౌన్సిల్ ఆమోదం లేకుండానే రూ.1.10కోట్ల చెక్కును గుత్తేదారులకు అప్పగించారన్నారు. కమిషనర్ వ్యవహారాన్ని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి నేరుగా తీసుకెళ్తామన్నారు. కొత్తగూడెం పరిరక్షణ కమిటీని ఏర్పాటుచేసి కమిషనర్‌ను జిల్లా నుంచే బదిలీ చేసేంతవరకు దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. క్రమబద్ధీకరణ పట్టాలను పంపిణీ చేయాలని నిరాహార దీక్షలు చేసిన తరువాత వచ్చిన 171జీవోను సైతం సవ్యంగా అమలు చేయడం లేదని విమర్శించారు. సమావేశంలో పురపాలక వైస్ ఛైర్మన్ రావి రాంబాబు, నాయకులు కంచర్ల గోపాలకృష్ణ, గుగులోతు కృష్ణ, వంశీ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోనేరు సత్యనారాయణ(చిన్ని)